సాక్షి
అనంతపురం
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



శింగనమల మార్కెట్ ఫస్ట్

మార్కెట్ ఫీజు వసూళ్లలో శింగనమల వ్యవసాయ కమిటీ 145 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది.

8లో

గరిష్టం/కనిష్టం

41.9°/20.2°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.. ఎండలు పెరగడంతో ఉక్కపోత కొనసాగుతోంది. నైరుతి దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 5 ఇసుక రీచ్‌లు



అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో 5 కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించినట్లు భూగర్భ గనులశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ నాగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా పామిడి, గార్లదిన్నె మండలం ఇల్లూరు, కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల్లో దాదాపు 1.50లక్షల మెట్రిక్ టన్నులు, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పరిధిలోని తూముకుంట, కొడిగెనహళ్లిలో రెండు రీచ్‌ల్లో 1.12లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండలం రాయవారిపల్లి, ఉప్పలపాడు, పీసీ రేవు గ్రామాల్లో మరో మూడు ఇసుక రీచ్‌ల అనుమతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు.

బుగ్గ రామలింగేశ్వరుణ్ని తాకిన సూర్యకిరణాలు



తాడిపత్రి అర్బన్: ప్రాచీన పుణ్యక్షేత్రమైన బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో బుధవారం సాయంత్రం సూర్య కిరణాలు మూలవిరాట్‌ను తాకాయి. ఏటా చైత్ర శుద్ధ చతుర్దశి పౌర్ణమి నాడు ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. బుధవారం సాయంత్రం 6.28 గంటలకు సూర్య కిరణాలు బుగ్గరామలింగేశ్వరుడిని తాకగానే అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగం స్వర్ణకాంతులు విరజిమ్ముతూ నూతన శోభను సంతరించుకుంది.

తక్కువ ధరకు బంగారమని బురిడీ

కణేకల్లు: తక్కువ ధరకు బంగారం ఇస్తామని అమాయకుడికి ఆశచూపి కర్ణాటకకు చెందిన ఒక ముఠా బురిడీ కొట్టించింది. రూ.5 లక్షలు తీసుకుని నకిలీ బంగారు అంటగట్టి ఉడాయించింది. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కథనం మేరకు... కర్ణాటకలోని హరాబిన అడగలికి చెందిన నాగరాజు కొందరితో కలిసి తక్కువ ధరకు బంగారమిస్తామంటూ పలువురిని మోసం చేస్తున్నాడు. ఈ క్రమంలో కణేకల్లులో తనకు పరిచయమున్న జావేద్ అనే వ్యక్తికి కేజీ బంగారం రూ.5లక్షలకు ఇస్తానని.. ఎవరైనా పార్టీ ఉంటే తీసుకురమ్మని చెప్పాడు. ఈ విషయాన్ని జావేద్ కళేకుర్తికి చెందిన కురుబ రుద్రకు చెప్పాడు. ధర తక్కువ అనడంతో ఆశపడిన రుద్ర ఫిబ్రవరి నెలలో రూ.5లక్షలు తీసుకొని కర్ణాటకకు వెళ్లాడు. అక్కడ నాగరాజు, జావేద్, మరికొందరు ముఠాసభ్యులు రుద్రతో నగదు తీసుకొని బంగారం ఇచ్చారు. దానిని ఇంటికి తీసుకొచ్చి భద్రపరిచాడు. మంగళవారం కణేకల్లులో టెస్ట్ చేయించగా.. నకిలీ బంగారం అని తేలింది. తనను మోసం చేశారని గ్రహించిన రుద్ర బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గజవాహనంపై రంగనాథుడు



తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి స్వామివారు గజ వాహనంపై విహరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రంగనాథస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆగండి.. ఆలోచించండి

మనిషి పుట్టుక నుంచి మరణం దాకా సాగే ప్రయాణమే జీవితం. చూడగలిగితే ప్రతి జీవితం ఓ అద్భుతమే. చదవగలిగితే ప్రతి జీవితమూ ఓ చరిత్రే. జీవితంలో పని ఒత్తిళ్లు, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, సంబంధాల విచ్ఛిన్నం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిళ్లు, మందలింపులు, వ్యసనాలు, తీవ్ర అనారోగ్యం లాంటి పరిస్థితుల్లో చాలామంది ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రతి సమస్యకూ ఏదో ఒక పరిష్కారం ఉంటుంది. ఆ దిశగా ఆలోచన చేస్తే కచ్చితంగా పరిష్కారం లభిస్తుంది. తద్వారా ఆత్మహత్య నుంచి బయటపడి ప్రశాంతంగా జీవనం సాగించవచ్చు.

- చిన్న చిన్న కారణాలకే మరణ శాసనం
- కెరీర్‌లో ఎదగాల్సిన వయసులో మనసు కల్లోలం
- ఐదున్నర మాసాల్లో 218 మంది బలవన్మరణాలు
- ఇందులో 30 ఏళ్లలోపు వయసున్న వారు 71 మంది



సాక్షి ప్రతినిధి, అనంతపురం:

- భార్యమీద అనుమానంతో అనంతపురంలోని రంగస్వామినగర్‌కు చెందిన రఫీ...తన ఇద్దరు పిల్లలను బుక్కరాయసముద్రం చెరువులో తోసి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అభం శుభం తెలియని ఆ ఇద్దరు చిన్నారులతో పాటు తండ్రి మృతిచెందిన తీరు జిల్లాలో తీవ్ర విషాదం నింపింది.
- ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన రమేష్‌నాయక్, బళ్లారి జిల్లా కూడ్లిగికి చెందిన శశికళతో ఇటీవల పెళ్లయ్యింది. పెళ్లయిన నాలుగురోజులకే శశికళ అనంతపురంలోని అపార్ట్‌మెంట్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాళ్ల పారాణి ఆరకముందే జరిగిన ఈ ఘటన అందరినీ కలచివేసింది.

జిల్లాలో ఆత్మహత్యల తీరు భీతిగొల్పుతోంది. క్షణికావేశంతో తీసుకుంటున్న ఆత్మహత్య నిర్ణయాలు తల్లిదండ్రులకు గుండెకోత మిగిలిస్తున్నాయి. చిన్న చిన్న మాటపట్టింపులు, కుటుంబాల్లో కలహాలు, తల్లిదండ్రుల మందలింపులు, కొత్తగా పెళ్లయిన జంటల మధ్య వచ్చే చిన్న సమస్యలు ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. ఒక్క క్షణం ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన వీళ్లు.. మృత్యువు వైపే మొగ్గుచూపడం కలచివేస్తోంది. జిల్లాలో గడిచిన ఐదున్నర మాసాల్లో 218 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో 30 ఏళ్లలోపు వారు 71 మంది ఉండటం ఆందోళన కలిగించే అంశం.

30 ఏళ్లకే మృత్యువు వైపు

ఉన్నత చదువులు చదువుకుంటున్న వారు, కెరీర్‌లో స్థిరపడబోతున్న వారు, అప్పుడప్పుడే వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న వారు ఇలా...నిండా మూడు పదుల వయసు దాటకుండానే ఆత్మహత్య వైపు మొగ్గుచూపడం కలకలం రేపుతోంది. రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఆత్మహత్య ఘటనలు నమోదవుతుండటం జిల్లాలో తీవ్ర సంచలనంగా మారింది.

ప్రధాన కారణాలు ఇవే..

- ఆర్థిక కారణాలతో చాలామంది యువతీ యువకులు ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు.
- కొత్తగా పెళ్లయిన జంటల్లో ఇరువురి మధ్యా సఖ్యత లోపించడం.
- జీవితంలో లేనివి ఊహించుకోవడం.. అవి అందకపోయేసరికి నిరాశ చెందడం.
- చెడు అలవాట్లు అంటే మద్యం, ఆన్‌లైన్ గేమ్స్ వంటి కారణాలతో సర్వం కోల్పోవడం.

వయసు	ఆత్మహత్యల సంఖ్య
15 ఏళ్లలోపు	5
16-30 ఏళ్ల మధ్య	71
31-45 ఏళ్ల మధ్య	85
46-60 ఏళ్ల మధ్య	33
61 ఏళ్లు దాటిన వారు	24
పురుషులు	157
మహిళలు	61
మొత్తం	218

ఆ రెండింటి మధ్య లోపమే

శారీరక ఎదుగుదల..మానసిక ఎదుగుదల రెండూ పరస్పర బ్యాలెన్స్‌తో ఉండాలి. కానీ చాలామందిలో శారీరక ఎదుగుదల ముందే వస్తుంది. మానసికంగా ఎదుగుదల లేకపోవడంతో క్షణికావేశంలో ఆత్మహత్య నిర్ణయం తీసుకుంటారు. దీన్నే ఇంపల్సివ్ సూసైడ్ అటెంప్ట్ అంటారు. ఇలాంటి వారికి ముందస్తుగానే అంటే ప్రవర్తనలో తేడా ఉన్నప్పుడే డాక్టరు కౌన్సెలింగ్ ద్వారా ఆత్మహత్య వైపు వెళ్లకుండా నియంత్రించవచ్చు.

–డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు

లేని లక్ష్యాలను అధిగమించే దిశగా..

చిన్న తనంలోనే పిల్లలకు తల్లిదండ్రులు లక్ష్యాలను విధిస్తున్నారు. ఈ గోల్స్‌ను అధిగమించలేక పిల్లలు ఆత్మహత్యలవైపు నిర్ణయం తీసుకుంటారు. ఇక పెళ్లయిన కొత్తలో స్వభావాల రీత్యా ఒక్కటి కాలేకపోవడం వల్ల జీవితం ఇంతేనా అని అనుకుంటారు. అత్యంత సున్నితంగా, ఎలాంటి కష్టాలు తెలియకుండా పెంచినప్పుడు చిన్న ఇబ్బందులను కూడా పిల్లలు తట్టుకునే పరిస్థితుల్లో ఉండరు. వారి శక్తికి మించిన లక్ష్యాలను నిర్దేశించకూడదు. కౌన్సెలింగ్ చేయడం అత్యంత ముఖ్యం. –డా.విశ్వనాథరెడ్డి, సైకియాట్రిస్ట్, జాతీయ హెల్త్‌మిషన్

15 నుంచి జీవాలకు నట్టలమందు



గొర్రెలకు నట్టలమందు తాపిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల 15 నుంచి గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టలమందు తాపించే డీ వార్మింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం బుధవారం 'సాక్షి'కి తెలిపారు. ఆర్‌బీకే వేదికగా గ్రామగ్రామానా శిబిరాలు ఏర్పాటు చేసి పశు సంవర్ధక శాఖ పారా స్టాఫ్ ద్వారా జీవాలకు నట్టలమందు వేస్తామన్నారు. నట్టలు చేరితే జీవాల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నందున కాపర్లు నష్టపోకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 లక్షల జీవాలకు నట్టలమందు తాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

10 వరకు పశువులకు ఎఫ్‌ఎండీ వ్యాక్సినేషన్లు

మార్చి ఒకటో తేదీన ప్రారంభమైన గాలికుంటు నివారణ (ఫుట్ అండ్ మౌత్ –ఎఫ్‌ఎండీ) ఉచిత వ్యాక్సినేషన్ల కార్యక్రమం ఈ నెల 10 వరకు పొడిగించినట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇప్పటికే 90 శాతం పశువులు, గేదెలు, ఎద్దులకు వ్యాక్సినేషన్లు పూర్తి కాగా... మిగతావి కూడా పూర్తి చేసి అన్ని వివరాలూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. 4.09 లక్షల పశువులకు ఎఫ్‌ఎండీ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: సంఘసంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 116 వ జయంతి వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, డిప్యూటీ మేయర్ వాసంతీ సాహిత్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆర్థిక, సామాజిక ఇబ్బందులను అధిగమించి ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడమే కాకుండా.. స్వతంత్ర భారతావని నిర్మాణంలో మూడు దశాబ్దాలపాటు సేవలందించారన్నారు. కార్మిక శాఖ మంత్రిగా పని చేసిన కాలంలో కార్మికుల హక్కుల కోసం అనేక చట్టాలు రూపొందించారన్నారు. వ్యవసాయ మంత్రిగా పని చేస్తున్న సమయంలో హరిత విప్లవాన్ని తీసుకొచ్చారన్నారు. 1971లో రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్‌కు ఘన విజయం అందించడంలో ఎనలేని కృషి చేశారన్నారు. నేటి యువత జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగభూషణం, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయిస్తా!

- పలువురు టీచర్లకు అగంతకుడు ఫోన్
- ఖర్చవుతుందంటూ నమ్మబలికిన వైనం

రాప్తాడురూరల్: 'హలో సర్...నేను ఎస్‌సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్)లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నా. మీరు సస్పెండ్ అయ్యారట కదా? మీకు ఏమీ ఇబ్బంది ఉండదు. ఆర్జేడీ సార్ చెప్పారు. ఆయనతో మాట్లాడి మీకు చెబుతా. కొంత ఖర్చవుతుంది' అంటూ ఓ అగంతకుడు రెండు రోజుల కింద సస్పెన్షన్‌కు గురైన టీచర్లకు ఫోన్లు చేయడం విద్యాశాఖలో కలకలం రేపుతోంది. పదో తరగతి పరీక్షలు, ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో తొలిరోజు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు టీచర్లను సస్పెండ్ చేశారు. బుధవారం ఈ టీచర్లకు 85200 95158 నంబరు నుంచి ఫోన్లు వచ్చాయి. సస్పెన్షన్లు ఎత్తివేసేందుకు తాను ఆర్జేడీతో మాట్లాడతానని నమ్మబలికి డబ్బులు అడిగే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చిన టీచర్లు, వివిధ సంఘాల నాయకుల ద్వారా వచ్చిన నంబరుకు ఫోన్లు చేస్తే పేరు చెప్పకుండా తాను సెక్రటేరియట్‌లో పని చేస్తున్నానని ఒకసారి, ఎస్‌సీఈఆర్టీలో పని చేస్తున్నానని మరోసారి పొంతన లేని సమాధానాలు చెబుతూ కట్ చేస్తున్నాడు. ఎవరో కావాలనే డబ్బు కోసం ఇలా చేశారా...లేదంటే ఆర్జేడీకి చెడ్డపేరు తెచ్చే ఉద్దేశంతో ఏమైనా ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన కూడా ఆ నంబరుకు ఫోన్ చేసి మాట్లాడారు. అగంతకుడు ఆర్జేడీతోనూ 'సార్‌తో మాట్లాడి నేను సస్పెన్షన్లు ఎత్తివేయిస్తానంటూ' చెప్పాడు. తాను ఆర్జేడీని మాట్లాడుతున్నానని చెప్పగానే 'సారీ సర్' అంటూ ఫోన్ కట్ చేశాడు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఈ నంబరు నుంచి ఫోన్లు వచ్చిన టీచర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆర్జేడీ సూచించారు. ఎవరికైనా ఇలాంటి ఫోన్లు వస్తే నమ్మొద్దన్నారు. నేరుగా తనకు ఫోన్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

శింగనమల: నియోజకవర్గ కేంద్రం శింగనమలలో రాములోరి కల్యాణోత్సవం బుధవారం రాత్రి రమణీయంగా సాగింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఒంటిమిట్ట తరహాలో శింగనమలలోనూ సీతారాముల కల్యాణం జరిగిందని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతి పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు.



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి

11న సర్వజనాస్పత్రి కమిటీ సమావేశం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 11న ప్రభుత్వ సర్వజనాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలోని ఆర్థోపెడిక్ సెమినార్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, కమిటీ సభ్యులు హాజరై, ఆస్పత్రి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

రాజకీయ అజ్ఞాని లోకేష్

- స్క్రిప్టులు తప్ప వాస్తవాలు తెలుసుకోని దద్దమ్మ
- అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం
- గత టీడీపీ పాలనంతా వర్గపోరు, అవినీతిమయమే
- నగరంలో ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలే నిర్ణయిస్తారు

అనంతపురం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాజకీయ అజ్ఞాని అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టులు చదవడం తప్ప వాస్తవాలు తెలుసుకోలేని చవట దద్దమ్మ అని విరుచుకుపడ్డారు. యువగళం పాదయాత్రలో భాగంగా అనంతపురంలో జరిగిన బహిరంగసభలో లోకేష్, మాజీ ఎమ్మెల్యే వి.ప్రభాకర్‌చౌదరి చేసిన వ్యాఖ్యలపై అనంత తీవ్రంగా స్పందించారు. బుధవారం అనంతపురం రూరల్ పంచాయతీ బైరవ్‌నగర్‌లో ఎమ్మెల్యే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మీడియాతో మాట్లాడుతూ మిడిమిడి జ్ఞానంతో టీడీపీ నేతలు మాట్లాడిన మాటలకు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. అయితే వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. మంగళవారం నాటి బహిరంగసభలో వ్యాఖ్యలు చూశాక లోకేష్ అజ్ఞానం ఏమిటో తెలిసిందన్నారు. ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రిపైన, తనపైన అవాకులు, చవాకులు పేలారని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని అన్నారు. అర్బన్ వైడెనింగ్ ప్రాజెక్ట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు టీడీపీ హయాంలోనే మంజూరయ్యాయని లోకేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే నిజమైతే నేషనల్ హైవే పరిధిలో ఉన్న రోడ్డును 2015లో ఆర్‌అండ్‌బీ పరిధిలోకి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. అధికారంలో ఉండగానే అర్బన్ రోడ్ వైడెనింగ్ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్డును నేషనల్ హైవే పరిధిలోకి తీసుకొచ్చి బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణంతో పాటు నడిమివంక నుంచి టవర్‌క్లాక్ వరకు ఆర్‌ఓబీ (బ్రిడ్జి) నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగకపోతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. లోకేష్, టీడీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎవరి హయాంలో నగరంలో అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలే 2024 ఎన్నికల్లో తేలుస్తారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

గెలవడం చేతకాక దొడ్డిదారిన పదవిలోకి వచ్చావ్

నారా లోకేష్‌కు గెలవడం చేతకాక తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని పదవిలోకి వచ్చావని ఎమ్మెల్యే అనంత ఎద్దేవా చేశారు. తాను మీ నాన్న చంద్రబాబు హయాంలోనే ఎంపీగా గెలిచానని, అనంతపురం అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తూనే ఉన్నానని చెప్పారు. ప్రజల మధ్య ఉంటూ.. వారి సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించగలిగిన వారే నిజమైన నాయకుడని అభివర్ణించారు. అలా ప్రజలతో మమేకమయ్యే నన్ను చేతకానివాడినంటావా అంటూ మండిపడ్డారు. ప్రజాసంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోని నువ్వు అధికారంపై యావతోనే ఇప్పుడు పాదయాత్ర చేస్తున్నావని విమర్శించారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని మీ నాన్న ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఎన్నికల్లో టీడీపీని ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీ పాలనంతా వర్గపోరు, అవినీతిమయమే

టీడీపీ గత ఐదేళ్ల పాలనంతా వర్గపోరు, అవినీతితోనే సరిపోయిందని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. టీడీపీ నేతలకు నగర అభివృద్ధిపై ఏమాత్రమూ చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడానికే సమయం సరిపోయిందన్నారు. ఆనాడు కమీషన్లు దండుకోవడానికి అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ వర్గాలుగా విడిపోయి.. నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో ప్రజలు మీకు సరైన గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికీ మీలో ఏమాత్రం మార్పు రాలేదని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, టీడీపీ నాయకులపై మండిపడ్డారు. తమ హయాంలోనే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని తీసుకొస్తే.. దాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించకుండా.. సాధారణ ఆస్పత్రిలా, కోవిడ్ ఆస్పత్రిలా మార్చారని ప్రభాకర్‌చౌదరి చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. 2013లోనే తాను ఎంపీగా ఉన్న సమయంలో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద అనంతపురం మెడికల్ కాలేజీ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వచ్చిందని స్పష్టం చేశారు. మరి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రాష్ట్ర వాటాగా రూ.30 కోట్లకు గాను టీడీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి అయినా ఖర్చు పెట్టారా అని ప్రశ్నించారు. విపత్తు సమయంలో అన్ని ఆస్పత్రులనూ కోవిడ్ వైద్యం కోసం వినియోగించిన విషయం తెలియదా అని నిలదీశారు. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. తాను ప్రజల సమస్యల పరిష్కార విషయంలో ఒక్క నంబర్ తక్కువ నొక్కితే.. మరి ప్రజలు నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా ఎందుకు గెలిపించారో తెలుసుకుంటే మంచిదని చురకలంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌శంకర్, జెడ్పీటీసీ చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాం నాయుడు, మహానందరెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

తాడిపత్రి: బారికేడ్లను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం ఆలూరుకు చెందిన గోసు ఓబినాథరెడ్డి (40) బుధవారం రాత్రి గుత్తి వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో చుక్కలూరు క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు బారికేడ్లు కనిపించకపోవడంతో నేరుగా వెళ్లి ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తాడిపత్రి రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో వరుస చోరీల కలకలం

గుత్తి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వాణిజ్య సముదాయంలోని నాలుగు దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి, నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. దూద్‌పీరా, జిలాన్, షేక్షావలి, సాహెబ్‌కు చెందిన మెకానిక్, స్పేర్‌పార్ట్స్, టింకరింగ్ దుకాణాలకు కన్నాలు వేసి లోపలకు ప్రవేశించినట్లుగా పోలీసులు గుర్తించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.



మార్కెట్ వసూళ్లలో శింగనమల ఫస్ట్

- లక్ష్యాన్ని చేరుకున్న మార్కెటింగ్‌శాఖ
- వెనుకంజలో నాలుగు యార్డ్‌లు
- ఓవరాల్‌గా 103 శాతంతో రూ.10.74 కోట్ల వసూళ్లు
- మూడో స్థానంలో అనంత యార్డ్



అనంతపురం అగ్రికల్చర్: మార్కెట్ ఫీజు వసూళ్లలో శింగనమల కమిటీ దూకుడు ప్రదర్శించింది. ఏకంగా 145 శాతం వసూళ్లతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా పరిశీలిస్తే మార్చి 31తో ముగిసిన 2022–23లో ఫీజు వసూళ్లలో మార్కెటింగ్‌శాఖ లక్ష్యాన్ని అధిగమించింది. 2020, 2021లో కరోనా లాక్‌డౌన్లు మార్కెట్లను ప్రభావితం చేయడంతో లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. 2022లో పరిస్థితి కొంచెం మెరుగవడంతో లక్ష్యానికి చేరువగా వచ్చాయి. ఈ సారి అనుకూల పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్ కమిటీల పయనం లక్ష్యం దిశగా సాగింది. జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా పన్నుల రూపంలో రూ.10.43 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకోగా... 103 శాతంతో రూ.10.74 కోట్లు సాధించడం విశేషం. శింగనమల తర్వాత 127 శాతంతో రాయదుర్గం, 118 శాతంతో అనంతపురం, 110 శాతంతో రాప్తాడు, 107 శాతంతో తాడిపత్రి మార్కెట్ కమిటీలు వంద శాతం కన్నా అధికంగా సాధించాయి. కేవలం 55 శాతం వసూళ్లతో గుంతకల్లు చిట్టచివరి స్థానంలో ఉండగా... 58 శాతంతో గుత్తి, 68 శాతంతో ఉరవకొండ, 71 శాతంతో కళ్యాణదుర్గం మార్కెట్ కమిటీలు ఆక్రమించాయి. నాలుగు కమిటీలు వెనుకంజలో నిలిచాయి.

ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.10.81 కోట్లు లక్ష్యం

ఈ నెల 1 నుంచి ప్రారంభమైన 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10.81 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సూత్రప్రాయంగా మార్కెట్ కమిటీలకు నిర్దేశించినట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి తెలిపారు. వెనుకబడిన మార్కెట్ కమిటీల్లో కూడా వంద శాతం వసూళ్ల సాధనకు విజిలెన్స్ చర్యలు పటిష్టం చేస్తామన్నారు. ఆయా మార్కెట్ కమిటీల్లో వనరులను బట్టి ఈ సారి టార్గెట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాయలసీమ రీజియన్ పరిధిలోని 8 జిల్లాలకు సంబంధించి అనంతపురం, తిరుపతి జిల్లాలు మాత్రమే ఈ సారి వందశాతం లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు.

2022-23లో మార్కెట్ కమిటీల వారీగా లక్ష్యం, సాధించిన ప్రగతి ఇలా

మార్కెట్ కమిటీ	లక్ష్యం	వసూళ్లు
అనంతపురం	రూ.3.50 కోట్లు	రూ.4.14 కోట్లు
తాడిపత్రి	రూ.1.76 కోట్లు	రూ.1.88 కోట్లు
రాయదుర్గం	రూ.1.15 కోట్లు	రూ.1.47 కోట్లు
గుంతకల్లు	రూ.1.05 కోట్లు	రూ.58.30 లక్షలు
శింగనమల	రూ.63 లక్షలు	రూ.89.61 లక్షలు
ఉరవకొండ	రూ.87 లక్షలు	రూ.59.34 లక్షలు
కళ్యాణదుర్గం	రూ.66 లక్షలు	రూ.46.84 లక్షలు
రాప్తాడు	రూ.44 లక్షలు	రూ.48.83 లక్షలు
గుత్తి	రూ.37 లక్షలు	రూ.21.44 లక్షలు

'అనంత' అభివృద్ధికి చిరునామా

- పెద్దమనిషి గురించి లోకేష్‌కు ఏం తెలుసు?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏనాడూ అవినీతి మరక అంటని కుటుంబం నుంచి వచ్చిన అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి జిల్లా రాజకీయాలకు పెద్ద దిక్కుగా ఉంటున్నారని, నగరాభివృద్ధినే ఊపిరిగా జీవిస్తున్న ఆయన గురించి ఏమీ తెలుసుకోకుండా చవకబారు విమర్శలు చేయడం లోకేష్ దిగజారుడు తనానికి పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టులో వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండించారు. 'రెండెకరాల స్థలం ఉన్న మీ బాబు.. రూ.వేల కోట్లు ఎలా సంపాదించాడు? రూ.వేల కోట్ల అవినీతి సంపాదనతో ఎదిగిన నీకు లోకమంతా అవినీతిమయంగానే కనిపిస్తోంది' అని ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చొరవ తీసుకోవడం వల్లనే జిల్లా కేంద్రం అన్నింటా అభివృద్ధి చెందుతోందన్నారు. బ్రిడ్జ్, ఫోర్ వే, నగరం నలుదిక్కులా విశాలమైన రోడ్లు, అంతర్గత రహదారులు, కాలువలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు అనంత వెంకట్రామిరెడ్డి హయాంలోనే జరిగాయన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితో పాటు టీడీపీ నాయకులు ఇచ్చిన స్క్రిప్టును చదివి లోకేష్ అభాసుపాలయ్యాడని పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి అన్నారు. గత టీడీపీ పాలనలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గపోరు కారణంగా నగరాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. తమ అనుయాయులకు లబ్ధిచేకూర్చేందుకు రాంనగర్ బ్రిడ్జ్‌ను కుదించి ప్రజలను ఇరకాటంలోకి నెట్టారన్నారు. బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం క్లాక్ టవర్ బ్రిడ్జ్‌తో పాటు, నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.వందల కోట్లతో జరుగుతున్న అభివృద్ధిని చూస్తే ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఎంత గొప్ప విజన్‌తో ముందుకెళ్తున్నారో ఇట్టే అర్థమవుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వాసులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే అనంత ప్రత్యేక చొరవ చూపారన్నారు. ఇప్పటికైనా లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గల శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

అనంతపురం క్రైం: భారత మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గల శ్రీనివాసులు, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర నాటక మండలి చైర్‌పర్సన్ హరిత, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీంఅహమ్మద్, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్‌నాగరాజు, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, అధ్యక్షురాలు కృష్ణవేణి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, నాయకులు అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంతో తడుస్తున్న యువ'గళం'


కూడేరులో మద్యం దుకాణం వద్ద టీడీపీ కార్యకర్తల సందడి

ఉరవకొండ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గతి తప్పింది. అనంతపురం నుంచి బుధవారం ఉదయం ఉరవకొండ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. మార్గమధ్యంలో కమ్మూరు వద్ద పాదయాత్రలో లోకేష్ వెంట ముఖ్య నాయకులు తప్ప ఇతరులెవరూ లేకపోవడంతో జనసమీకరణకు ఆ పార్టీ నేతలు నానా తిప్పలు పడ్డారు. చివరకు మద్యం, డబ్బు, బిర్యానీ ఎరగా చూపి అమాయక యువతను లోబర్చుకుని తరలించారు. దీంతో కూడేరులోని మద్యం దుకాణాల వద్ద సందడి నెలకొంది. మద్యం తాగి బాటిళ్లు ధ్వంసం చేస్తూ హంగామా చేశారు. అదే సమయంలో కూడేరులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని తీసుకెళ్లేందుకు వస్తున్న 108 అంబులెన్స్‌కు దారివ్వకుండా నడిరోడ్డుపై డ్యాన్స్ చేయసాగారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని అంబులెన్స్‌ను ముందుకు పంపించాల్సి వచ్చింది.

నారా లోకేష్.. నోరు అదుపులో పెట్టుకో

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



రాప్తాడురూరల్: 'నారా లోకేష్...నోరు అదుపులో పెట్టుకో. మీ పార్టీ ఉనికిని చాటుకునేందుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులను ఇష్టం వచ్చినట్లు తిడితే చూస్తూ ఊరుకోబోం' అని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'యువగళం పేరుతో నీవు చేస్తున్న పాదయాత్ర ఎందుకో కనీసం నీకైనా తెలుసా?' అని ప్రశ్నించారు. పాదయాత్ర అంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా ప్రజలతో మమేకమై సాగాలని సూచించారు. ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి మార్గాలు అన్వేషించేలా ఉండాలన్నారు. అధికారం అంటే అందినంత అడ్డగోలుగా దోచుకోవడం, దాచుకోవడం కాదన్నారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించడానికి 'గడప గడపకూ మన ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని జగన్ సర్కార్ చేపట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలంతా ప్రజల్లోనూ ఉంటూ, ఆయా ప్రాంతాల అభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. నీలా ఎవరేకాని అడ్డదారిలో చట్టసభల్లో కాలు పెట్టలేదని, ఎన్నికల్లో పోటీ పడి ప్రజాభిమానంతో గెలుపొందారనే విషయాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పకుండా, తిరిగి అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో వివరించకుండా కేవలం ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు సాగిస్తే ఎన్నటికీ నాయకుడివి కాలేవన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించి మాట్లాడాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు ఎలా అనుమతిస్తారు?

- టెలీ కాన్ఫరెన్స్‌లో ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం



రాప్తాడురూరల్: 'ఇదేం పద్ధతి? పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఇవ్వొద్దని పదేపదే చెబుతున్నాం. అయినా సార్వత్రిక విద్యా పీఠం పరీక్షలు రాస్తున్న రెండు కేంద్రాల్లో ఇద్దరి వద్ద మొబైల్ ఫోన్లు కనిపించాయి. ఇందుకు బాధ్యత వహించాల్సింది ఎవరు? ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తెలీదా? ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేస్తే అక్రమ సస్పెన్షన్లని ఎలా అంటారు' అని విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి, డిప్యూటీ డీఈఓలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, సీఎస్‌లు, డీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో ఇద్దరు వ్యక్తుల బ్యాగుల్లో మొబైల్ ఫోన్లు ఉన్నాయన్నారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సస్పెన్షన్లు అక్రమం అని కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారని, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్తే సక్రమమా? అని ప్రశ్నించారు. మొబైల్ ఫోన్లు తీసుకెళ్లి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని ఏమైనా కుట్ర పన్నారా? అంటూ మండిపడ్డారు. నిబంధనలకు అనుగుణంగానే విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏ చిన్న ఘటన జరిగినా సీఎస్‌లు, డీఓలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

డిప్యూటీ సీఈఓ బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు తీసుకుంటున్న అమృతరాజ్

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా ఎండీ అమృతరాజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉరవకొండ ఎంపీడీఓగా పని చేస్తున్న ఆయన జెడ్పీ అకౌంట్స్ ఆఫీసర్‌గా రెండు నెలల క్రితమే వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్తాడు షేక్ రఫీ, కేశవ సహా పలు విభాగాల ఏఓలు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

నీట మునిగి విద్యార్థి మృతి

గుమ్మఘట్ట: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన తిప్పేశ, మాలక్క దంపతులకు గణేష్ (14)తో పాటు మరో కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గణేష్... బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు వేదవతి హగరి నదికి వెళ్లాడు.

లోతైన ప్రాంతంలో దిగడంతో ఈత రాక నీటి మునిగిపోవడంతో స్నేహితులు గట్టిగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశారు. స్థానికులు అక్కడకు చేరుకుని నీటిలో గాలించి గణేష్‌ని వెలికి తీశారు. అప్పటికే ఊపిరి ఆడక బాలుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సునీత అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నేడు సంగమేశ్వరుడి రథోత్సవం


ముస్తాబు చేసిన కూడేరులోని జోడులింగాల సంగమేశ్వరుడి ఆలయం

కూడేరు: మండల కేంద్రంలో వెలసిన శివపార్వతుల జోడులింగాల సంగమేశ్వర ఆలయ రథోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, ఈఓ బాబు ఏర్పాట్లు పూర్తి చేశారు. దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన శైవ క్షేత్రాల్లో ఈ ఆలయం ఒకటి. భక్తుల కోర్కెలు తీర్చేందుకు ఆదిదంపతులు స్వయంభువుగా ఇక్కడ వెలిసినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. క్రీ.శ 16వ శతాబ్దంలో అప్పటి రెడ్డి రాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా తెలుస్తోంది. ఉత్సవంలో భాగంగా గురువారం ఉదయం 9.40 గంటలకు మడుగు తేరు, సాయంత్రం ఆరు గంటలకు ప్రధాన రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

కలెక్షన్ సెంటర్ల తనిఖీ


కల్లూరులోని కలెక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన రైతుల కోసం రాయితీతో ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్లను ప్రత్యేక అధికారి హోదాలో కర్నూలు జిల్లా ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఉద్యానశాఖ జిల్లా అధికారులు బి.రఘునాథరెడ్డి, ఏడీ నరసింహారావు, మండల స్థాయి అధికారులు ఉన్నారు. 75 శాతం రాయితీతో అనంతపురం రూరల్, గుత్తి, శింగనమల, ఆత్మకూరు ప్రాంతాల్లో రైతు గ్రూపులు ఏర్పాటు చేసుకున్న కలెక్షన్ సెంటర్లను వారు తనిఖీ చేశారు. ఉద్యానహబ్ దిశగా అడుగులు వేస్తున్న అనంతపురం జిల్లాలో కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు చాలా అవసరమని ఈ సందర్భంగా రైతులకు వారు సూచించారు. ఈ సెంటర్ల వల్ల రైతులకు మంచి గిట్టుబాటు ధరలు లభ్యమవుతాయన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

8న 'రన్ ఫర్ జీసెస్'



టీ షర్టులను ఆవిష్కరిస్తున్న కమిటీ మెంబర్లు

అనంతపురం కల్చరల్: క్రీస్తును ఘనపరుస్తూ ఈనెల 8న 'రన్ ఫర్ జీసెస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ రెవరెండ్ బెన్ హర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక జీసెస్ కంపాషన్ చర్చిలో పాస్టర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. రన్ ఫర్ జీసెస్ టీ షర్టులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. కమిటీ కో కన్వీనర్లు పాస్టర్‌సంపత్‌కుమార్, జోసెఫ్, రెవ.మోసెస్ అనిల్‌కుమార్, కొఠారి డేనియల్, ఆదాము, కాంతి జాన్ వెస్లీ, సుందరరావు, ఈటె స్వామి దాసు తదితరులు సమావేశంలో క్రీస్తు ఆదర్శ జీవితం గురించి మాట్లాడారు. అంతకు ముందు సామూహిక ప్రార్థనలు జరిగాయి.

రేపు రక్తదానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఏ హాల్‌లో తలసేమియా రోగుల కోసం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఐఎంఏ ఉమెన్ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ హేమలత తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చని ఆమె తెలిపారు.

అభివృద్ధి కనిపించలేదా లోకేష్ ?

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించలేదా లోకేష్ అని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే నగరాభివృద్ధి గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగిందన్నారు. రూ. 600 కోట్లతో అభివృద్ధి జరుగుతోందన్నారు. లోకేష్ నడిచిన ప్రతి రోడ్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వేసిందేనన్నారు. కళ్లుండీ చూడలేవు, చెవులుండీ వినలేవని, అందుకే నిన్ను పప్పు అని అంటారని మండిపడ్డారు. నువ్వే ఒక పప్పు, తుప్పు అని విమర్శించారు. తమ ఎమ్మెల్యేలు అభివృద్ధి సారథులు, సంక్షేమ సారథులు అని, పులకేశి నువ్వా మాట్లాడేది అని ఎద్దేవా చేశారు. మాట తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్వామియే శరణమయ్యప్ప



పూజలందుకున్న అయ్యప్ప స్వామి

అనంతపురం కల్చరల్: హరిహర సుతుడి జన్మదిన వేడుకలు బుధవారం పలుచోట్ల వైభవంగా జరిగాయి. మొదటిరోడ్డు శ్రీహరిహర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకార సేవలు, అభిషేకాలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. అనంత అయ్యప్ప సేవా స్రవంతి ప్రతినిధులు రంగాచారి, భవానీ రవికుమార్ నేతృత్వంలో స్వామివారి విగ్రహాలను అనంత నుంచి పెన్నోహబిలం క్షేత్రం సమీపంలోని ఏటి గంగమ్మ ఏరు వరకు తీసుకెళ్లి పవిత్ర ఆరాట్టు (చక్రస్నానం) సేవలు నిర్వహించారు. పాతూరు చెరువుకట్ట, 80ఫీట్ రోడ్డు, హెచ్చెల్సీ కాలనీ తదితరచోట్ల సాగిన వేడుకల్లో సామూహిక భక్తిగీతాలాపనలు, భజనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వామివారి నామస్మరణతో మార్మోగించారు.

ఢిల్లీలో 'అనంత' కార్మికుల ఆందోళన



ఆకులు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో బుధవారం సీపీఎం అనుబంధ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో జిల్లాకు చెందిన సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, కార్మిక, కర్షకులు పాల్గొన్నారు. ఆకులు కట్టుకొని అర్ధనగ్నంగా వినూత్నంగా నిరసన తెలిపారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా నడి రోడ్డుపై బైఠాయించి ఆందోళన కొనసాగించారు. వారికి సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

- మహిళలను నిలువునా ముంచిన ఘనుడు చంద్రబాబు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం తపోవనం సమీపంలోని వీవీఆర్ ఫంక్షన్ హాలులో అనంతపురం నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. ఆసరా మూడో విడతలో భాగంగా 559 డ్వాక్రా సంఘాల్లో 5,509 మంది మహిళలకు రూ. 5.15 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధిలో పయనిస్తేనే ఆయా కుటుంబాల్లో వెలుగులు నిండుతాయన్నారు. అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించి డ్వాక్రా మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందించి అండగా నిలిచారని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణాలు మాఫీ చేసి అండగా నిలిచారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. రాజకీయ పదవులతో పాటు నామినేటెడ్ పదవులను సైతం అధిక శాతం మహిళలకే కేటాయించి ఏకైక సీఎం జగనేనన్నారు. టీడీపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా ఉండేదన్నారు. మహిళా ఉద్యోగులు సైతం విధులు సక్రమంగా నిర్వర్తించలేని దుస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే మహిళలకు అన్ని విధాల రక్షణ లభించిందన్నారు. దిశ చట్టం తీసుకొచ్చి మహిళలకు అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని మహిళలకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, రుద్రంపేట సర్పంచ్ పద్మావతి, అనంతపురం రూరల్ సర్పంచ్ ఉదయ్‌శంకర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు మల్లెల వేణుగోపాల్, బి. మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం !



చిన్మయనగర్‌లో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. అత్యాధునిక వసతులతో ఎంతో సుందరంగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.



ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయం

నగరాభివృద్ధే మా ధ్యేయం

- మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరాభివృద్ధే తమ ధ్యేయమని మేయర్ మొహమ్మద్ వసీం సలీం తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో గెలవని లోకేష్ కూడా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగినది అనంత వెంకటరామిరెడ్డి కుటుంబమన్నారు. ఎమ్మెల్యే చొరవతోనే నగరాభివృద్ధికి రూ. 10 కోట్లు, రూ. 30 కోట్లు, ప్రస్తుతం రూ. 25 కోట్ల స్పెషల్ గ్రాంట్ వచ్చాయన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల గురించి ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకోమన్నారు. వాస్తవాలు ప్రజలు తెలుసుకున్నారు కాబట్టే తెలుగుదేశం పార్టీకి నగరపాలక సంస్థలో కనీస ప్రాతినిధ్యం లేకుండా చేశారన్నారు. టీడీపీ హయాంలో గ్రూపు రాజకీయాలు, కమీషన్ల కోసం కక్కుర్తి పడింది ఎవరో ప్రజలకు పూర్తిగా తెలుసన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అభివృద్ధిని చేసి చూపుతున్నామన్నారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పీఏబీఆర్ ద్వారా నగరానికి సమృద్ధిగా నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. కేవలం వినతిపత్రాన్ని ఇచ్చినంత మాత్రాన రోడ్లు వస్తాయా లోకేష్ అని ప్రశ్నించారు. ఎవరో స్క్రిప్టు రాసిస్తే చదివేయడం కాదు వాటిలో ఉన్న వాస్తవాలను తెలుసుకోవాలని హితవు పలికారు. ముస్లింలను అన్ని విధాలుగా ఆదుకున్న ప్రభుత్వం ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. నడిమివంక ప్రాంతాన్ని ఎవరి హయాంలో ఏ పార్టీ వారు కబ్జా చేశారో ప్రజలందరికి తెలుసన్నారు. అనంతకు కేటాయించిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తీసుకెళ్లింది టీడీపీ హయాంలో కాదా అని ప్రశ్నించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేశామని అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సోని రమణ, సాకే చంద్రలేఖ, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కవితాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన వివాహితలు 6 నుంచి 12వ తేదీలోగా తమ దరఖాస్తులను చెన్నేకొత్తపల్లి సీడీపీఓ కార్యాయలంలో అందజేయాలన్నారు. రామగిరి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త గరిమేకలపల్లి బీసీ–సి, చెన్నేకొత్తపల్లి మండలం గొల్లవాండ్లపల్లి బీసీ–ఈ, అంగన్‌వాడీ హెల్పర్లు రామగిరి మండలం రెడ్డివారిపల్లి ఓసీ, తిమ్మాపురం(మెయిన్) బీసీ–డీ, గరిమేకలపల్లి (మెయిన్) ఎస్సీ, చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి(మెయిన్) బీసీ–బీ, ముష్టికోవెల (మెయిన్) ఓసీ, కనుముక్కల బీసీ–డీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

7 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'



రాప్తాడులో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: 'దేశంలో మరెక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.. ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా వాటిని ఆదర్శంగా తీసుకుంటున్నారు' అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మంచిని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తెలియజేసే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. టీడీపీ నాయకులతో పాటు కొన్ని పచ్చ పత్రికలు పనికట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. జిల్లాలో మొట్ట మొదటగా గెలిచే సీటు రాప్తాడే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వెల్పుల రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, సింగారప్ప, మాచినేని చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి, చిరుతల నాగేంద్ర, రవి, కొండారెడ్డి, కపాడం ఈశ్వరయ్య, డొక్కా రామచంద్ర, డొక్కా విజయశంకర్, భాస్కర్ రెడ్డి, మహిళ నాయకురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల, గృహసారథుల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి సమావేశం నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్లకు కిట్లను అందచేశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రతి గడపకూ తిరిగి వివరించాలన్నారు. సర్పంచులు వరలక్ష్మి, ఎర్రిస్వామి, వెంకటేష్‌నాయక్, ఓబులేష్, వైస్ ఎంపీపీ విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గూలి కొండారెడ్డి, బుషిరెడ్డి, అంజనప్ప, వన్నూరప్ప, గంగాధర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, అతికిరెడ్డి, రాము, పోతన్న, ఎర్రిస్వామి, నాగమలేశ్వరరెడ్డి,కృష్ణా నాయక్, ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందిన అభ్యర్థికి మెమొంటో అందజేస్తున్న అధికారులు

అనంతపురం టౌన్: వృత్తి విద్యా శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఎల్‌డీఎం నాగరాజ రెడ్డి సూచించారు. బుధవారం రూడ్‌సెట్ సంస్థలో 84వ లోకల్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ వృత్తి విద్యపై ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందించి అండగా నిలుస్తోందన్నారు. శిక్షణ అనంతరం ఆయా రంగాలపై ఆధారపడి జీవించేందుకు బ్యాంకర్ల ద్వారా రుణ సదుపాయాలను సైతం కల్పిస్తోందన్నారు. అనంతరం మొబైల్, ద్విచక్ర వాహనాల, బ్యూటీపార్లర్ల నిర్వహణపై శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావుతోపాటు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం అనురాధతోపాటు ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధి తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ, కార్యదర్శి రమ

అనంతపురం క్రైం: పోరాటపటిమతో ఎంతో మంది యువతకు జగ్జీవన్ రామ్ ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జయంతిని పురస్కరించుకుని స్థానిక సప్తగిరి సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, నగరధ్యక్షుడు సాకే కుళ్లాయస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో..

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్ అన్నారు. వారి అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించారన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించడానికి, అస్పృశ్యతను పోగొట్టడానికి పోరాడారన్నారు. ప్రస్తుత సమాజంలో అందరూ అన్ని సమానంగా సాధించగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ శంకర్, శైలజ, శారద, రవితేజ, భాస్కర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, సూపరింటెండెంట్ రవికుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థలో..

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా గ్రంథాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతికి ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు పాటుపడదాం

అనంతపురం టవర్‌క్లాక్: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు పాటుపడదామని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర తెలిపారు. బుదవారం స్థానిక జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామచంద్ర మాట్లాడుతూ బహుజనులలో ఐక్యత రావాలని, సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, కోటి మలేష్,ప్రభాకర్, వర్ల శంకర్,నరసింహులు, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- బాబు జగ్జీవన్ రామ్ జయంతి రోజు సెలవు ప్రకటించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాంజినేయులు, శేషు, మంజునాథ్, రామకృష్ణ,కేశవ, నారాయణస్వామి, శివ శంకర్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



సర్వాంగ సుందరంగా అలంకరించిన సీతారాముల విగ్రహాలు



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు




సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. అర్చకులు హర్షశర్మ రాములోరి పరిణయ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలందుకున్నారు. సాయంత్రం వాహన సేవలు ఘనంగా సాగాయి. చంద్రప్రభ వాహనంపై సీతారాములు నగరవీధుల్లో విహారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో స్వామివారికి కళానీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఈఓ సుధారాణి, ధర్మకర్తల మండలి సభ్యులు చంద్ర, సురేష్, తిమ్మారెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల తిరుపతి దేవస్థానాల వారు అందించిన సీతారాముల విగ్రహాలకు బుధవారం రాత్రి నేత్రానందంగా కల్యాణ మహోత్సవం జరిగింది.

ఒంటిమిట్ట ఆలయ సంప్రదాయాన్ని పాటిస్తూ వారి సౌజన్యంతో నగరంలోని తపోవనం శ్రీవేద మాత గాయత్రి దేవస్థానంలో సాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. వేదపండితుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణంలోని ఎదురుకోళ్లు, ముత్యాల తలంబ్రాలు ప్రతి ఘట్టాన్ని అర్చకులు సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి సత్యమూర్తి, మంజునాథ్, మంజునాథ్ తదితరులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

నోరు అదుపులో పెట్టుకో లోకేష్



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం క్రైం: నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురించి అవగాహన లోపంతో టీడీపీ నేత నారా లోకేష్ మాట్లాడారన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేష్‌కు ఏళ్ల తరబడి జిల్లా ప్రజలకు సేవలందించిన ఎమ్మెల్యే అనంతను విమర్శించడానికి నోరెలా వచ్చిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్ల రూపురేఖలు మారిపోయాయన్నారు. రూ.312 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జ్ ఎవరి హయాంలో మంజూరైందన్న విషయం కూడా తెలియకుండా మాట్లాడడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి సాధనలో దివంగత అనంత వెంకటరెడ్డి చేసిన కృషిని గుర్తు చేశారు. లోకేష్ కనీస జ్ఞానం లేకుండా మాట్లాడడం సరికాదని పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ పేర్కొన్నారు. చౌకబారు రాజకీయాలకు పాల్పడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు అబూసలేహ, ఇసాక్, బాబాఫక్రుద్దీన్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబం అభివృద్ధికి కేరాఫ్ అని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పేర్కొన్నారు. నగర రూపురేఖలు మార్చేందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆత్మకూరు: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. కేజీబీవీలో నిరుపయోగంగా వదిలేసిన ఆర్‌ఓ ప్లాంట్‌కు సంబంధించి బుధవారం సాక్షి పేపర్‌లో 'నిర్లక్ష్యానికి పరాకాష్ట' అన్న శీర్షిక వెలువడింది. నాయకులు బుధవారం ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలించారు.శుభ్రం చేయించి రన్ చేయించారు. బోరు నీరు తక్కువగా వస్తుండటంతో ఉపయోగించలేదని ఫోన్‌లో ఎస్‌ఓ వెంకటలక్ష్మి సమాధానం ఇవ్వడంతో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. నాయకులు గూలి కొండారెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులున్నారు.